క్లుప్తంగా

అటవీ హక్కు పత్రాలు ఇప్పించాలని వినతి

ఆసిఫాబాద్: గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న అటవీ భూములకు అటవీ హక్కు పత్రాలు ఇప్పించాలని కోరుతూ వాంకిడి మండలం పిప్పర్‌గోంది గ్రామానికి చెందిన రైతులు రాథోడ్ రాందాస్, లక్ష్మణ్ శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తాము గ్రామంలోనే నివాసముంటున్నా అధికారుల సర్వే సమయంలో కొంతమంది గ్రామంలో లేనట్లు తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు.

దహెగాంలో చిరుజల్లులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మండలంలో చిరుజల్లులు కురుస్తున్నందున రైతులు పత్తివిత్తనాలు విత్తడంలో బిజీ అయ్యారు. ఎక్కడ చూసినా రైతులు, కూలీలు వ్యవసాయ పొలాల్లో కనిపిస్తున్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రేషన్ కార్డు లేని పేదలకు తక్షణమే రేషన్ కార్డులు జారీ చేయాలని సీపీఐటీయూ నాయకుడు ఆనంద్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 30న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డు లేని పేదలు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవడానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, జిల్లా, మండల విద్యాధికారుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అరుణ్, ప్రాంత కార్యసమితి సభ్యులు రాజ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో విస్తారక్ యోజన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో కలిసి విద్యాశాఖపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడతామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి మరో విద్యార్థి ఉద్యమానికి విద్యార్థులు, సంఘం నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మొబైల్ ఆస్పత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులను పరిశీలిస్తున్న వైద్యుడు అమన్

పెంచికల్‌పేట్: మొబైల్ ఆస్పత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమన్ అన్నారు. మండలంలోని ఎల్లూర్ గ్రామంలో శుక్రవారం మొబైల్ ఆస్పత్రి సేవలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించడానికి గ్రామంలో మూడురోజుల పాటు మొబైల్ ఆస్పత్రి సేవలను అందించనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సాయిరామ కృష్ణ శర్మ అన్నారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన, మహాపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు గజాన నాయక్, ఆలయ కమిటీ సభ్యులు చౌహాన్ మహేందర్, చౌహాన్ సంతోశ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పండుగల నేపథ్యంలో ఆలయాలు, మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు పలువురు స్థానికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పోచమ్మ బోనాల నేపథ్యంలో ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఆ ప్రాంతంలో ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచి, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈనెల 29న బక్రీద్ నేపథ్యంలో బస్టాండ్, క్వారీ రోడ్డు ఈద్గాల వద్ద శుభ్రం చేసి, టెంట్లు, మంచినీరు, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ ఎండీ మినాజుద్దీన్, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, గౌసొద్దీన్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో మోసాలు!

- అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ యజమానులు
- మూడు కంపెనీల పత్తి విత్తనాలకు డిమాండ్



జిల్లాకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులో పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

ఆసిఫాబాద్‌రూరల్: వానాకాలం ప్రారంభం కావడంతో మండల రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ఫర్టిలైజర్ షాపుల్లో సందడి నెలకొంది. విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు ఎగబడుతున్నారు. ఇదే అదనుగా భావించిన ఫర్టిలైజర్ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారు. కొన్ని షాపుల నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలతో పాటు ధర, బరువు, తయారు చేసిన కంపెనీ పేరు లేని విత్తన ప్యాకెట్లను రైతులకు అంటగడుతున్నారు. మండలంలో చాలా వరకు ఏజెన్సీ గ్రామాలు కావడంతో అవగాహన లేని రైతులు ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇచ్చిన విత్తనాలనే తీసుకెళ్తున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

ఫర్టిలైజర్ యజమానులు పత్తి విత్తన ప్యాకెట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో పత్తి ప్యాకెట్‌ను రూ.853లకు మించి అమ్మరాదు. కానీ కొన్ని రకాల పత్తి విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా మూడు కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలపై రైతులు ఆసక్తి చూపడం, వాటి స్టాక్ ఈ సారి తక్కువగా రావడం, తో ఫర్టిలైజర్ షాపుల యజమానులు ధరను పెంచి ఒక్కో ప్యాకెట్‌కు రూ. 1000 నుంచి రూ. 1200 వరకు అమ్ముతున్నారు. కొంత మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ధర ఎక్కువగా చెల్లించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు జిల్లా కేంద్రంలో దొరక్కపోవడంతో స్థానిక రైతులు వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి వంటి పట్టణాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

డీలర్లకు భారీ ఆఫర్లు..

మండలంలో 12వేల మంది రైతులు 56వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా పత్తి పంటను 38వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని చాలా గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. కాగా కొన్ని కంపెనీలు ఎక్కువగా విత్తనాలు విక్రయించే డీలర్లకు భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. దీంతో ఫర్టిలైజర్ యజమానులు రైతులకు మాయమాటలు చెప్పి సదరు కంపెనీల విత్తనాలను విక్రయిస్తున్నారు. ఏజెన్సీ రైతులు విత్తనాలపై అవగాహన లేక ఫర్టిలైజర్ యజమానులు చెప్పింది నమ్మి వాటిని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు తమకు నచ్చిన కంపెనీల విత్తనాలు ఇవ్వాలని చెబుతున్నా ఫర్టిలైజర్ యజమానులు ఆఫర్లు ప్రకటించిన విత్తనాలను కొంటేనే ఇస్తామని చెబుతుండడంతో రైతులు గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ. 1200లు చెల్లించా..



డిమాండ్ బాగా ఉన్న ఒక కంపెనీ పత్తి విత్తన ప్యాకెట్‌ను రూ.1200 పెట్టి తీసుకున్నా. డిమాండ్ ఉన్న వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వేరే రకం ప్యాకెట్లను రూ. 853లకు ఇస్తున్నారు. అధికారులు ఫర్టిలైజర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

- నాందేవ్, రైతు

నేల స్వభావాన్ని బట్టి ఎంపిక

రైతులు నేల స్వభావాన్ని బట్టి పత్తి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.853 కంటే అధిక ధరలకు విక్రయించరాదు. అధిక రేట్‌కు అమ్మితే సమాచారం ఇవ్వాలి. రైతులు ఒకే రకం కాకుండా 4, 5 రకాల విత్తనాలు తీసుకోవాలి.

- ఖాదర్ హుస్సేన్, ఏవో

సమస్యలపై దృష్టి సారించండి


- అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- ముగిసిన మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యాదవ్ రావు, పక్కన ఎంపీపీ తిరుమల విశ్వనాథ్

నార్నూర్: జైనూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పలు గిరిజన గ్రామాల్లో మిషన్ భగీరథ రాక తీవ్ర నీటి సమస్య ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ తిరుమల విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాట్నపూర్ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధికారుల సమన్వయ లోపం వల్ల నీటి సరఫరాలో జాప్యం జరుగుతుందని మండిపడ్డారు. అధికారులు సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభుదయ, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, విద్యాధికారి సుధాకర్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ



ట్యాబ్ అందజేస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని 50 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 46 ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కెరమెరిలోని ప్రాథమిక పాఠశాలకు రెండు ట్యాబ్‌లు అందించగా మిగిలిన పాఠశాలలకు ఒక్కో ట్యాబ్ అందించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి విద్యార్థుల వివరాలతో పాటు, పరీక్షల గ్రేడింగ్‌లు ట్యాబుల్లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఘనంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



కౌటాల: వర్ధంతి నిర్వహిస్తున్న నాయకులు

రెబ్బెన: జాతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో గోలేటిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాం నాయక్ మాట్లాడుతూ దేశంలో తొలి హిందువాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థానం పొందాడన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, నాయకులు ప్రకాశ్, కాంచ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ఎదుట శుక్రవారం మండలంలోని బీజేపీ నాయకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి, బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు నారులే వానుపటేల్ మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన జాతీయవాది అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు బండి రాజేందర్‌గౌడ్, మృత్యుంజయ్, భూమయ్య, మధుకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు జాతీయవాద నాయకుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని బెజ్జూర్ సంఘ్ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్ అన్నారు. బలిదాన్ దివస్ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ్ మండల ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ యాదవ్, మాజీ వైస్‌ఎంపీపీ తాళ్ల రామయ్య, మాజీ సర్పంచ్ వసి ఉల్లాఖాన్, మర్తుడి మాజీ సర్పంచ్ ఉమ్మెర లింగయ్య, కాటేపల్లి ఉప సర్పంచ్ కోర్తే తిరుపతి, కడప సత్యవన్, జాడి తిరుపతి, టాకిరా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



రెబ్బెనలో..

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రవీంద్రనగర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఏవో

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో శుక్రవారం వ్యవసాయ అధికారి రామక్రిష్ణ తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ దుకాణాలలో విత్తనాలు, ఎరువులను ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు కంపెనీ విత్తనాల మొలక శాతం తెలుసుకోవడానికి ప్యాకెట్ల నుంచి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా దుకాణాలకు వచ్చిన రైతులకు విత్తనాల ఎంపిక, నాటడంలో తలెత్తే సమస్యలను వివరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలలో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తనాలను డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఫర్టిలైజర్ దుకాణాలలో డీలర్లు నిబంధనలు పాటించాలన్నారు. స్టాక్ బోర్డ్ కనిపించేలా ఉంచాలని, రిజిస్టర్లలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈవో శ్రీనివాస్, డీలర్లు, రైతులు ఉన్నారు.

'ట్రస్టులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్: వాంకిడి మండలంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ట్రస్టు ఆస్తుల అక్రమాలపై విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చెన్నూరి అశోక్, పట్టణ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టుకు సంబంధించిన విలువైన భూమిని అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 2021లో ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పుడు బ్యాంకులో రూ.25 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారని, దీనిపై వచ్చే వడ్డీ ఖర్చు వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా ట్రస్టు నిర్వాహకులు లెక్క చెప్పకుండా వేతనాల పేరుతో స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ట్రస్టుకు సంబంధించిన జమ ఖర్చు వివరాలు బహిర్గతం చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న గంగాసింగ్

పెంచికల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులను, ధ్రువపత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయా గ్రామపంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో గంగాసింగ్ మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీలకు ప్రభుత్వం అందించే రూ. లక్ష సాయానికి సంబంధించిన దరఖాస్తులను ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 535 దరఖాస్తులు వచ్చాయని, అందులో 322 కులవృత్తులు చేస్తున్న వారు ఉండగా, 213 మంది కులవృత్తులు చేయని వారు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, తిరుపతి, రజిత, సునీత, శాలిని, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న ఎస్పీఎం ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామ పంచాయతీలోని నందిగూడ గ్రామంలో స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం మిల్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా భారీ స్పందన లభించింది. ఈసందర్భంగా ఎస్పీఎం వైస్ ప్రెసిడెంట్ మిశ్రా, జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ రవి, కిరణ్, చైతన్యలు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిల్లు ప్రతినిధి తుమ్మ రమేశ్, సర్పంచ్ ముంజం రమేశ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ పాల్గొన్నారు.

'సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం'



చెక్కు అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన సాయిశ్రీ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో మంజూరైన రూ. 22వేల చెక్కును వారికి అందజేశారు. కార్యక్రమంలో బారెగూడ సర్పంచ్ విమల సంతర్, మండల కోఆప్షన్ సభ్యులు బాబా, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేస్తున్న అధికారికి సన్మానం



గోపాలక్రిష్ణమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న జీఎం

రెబ్బెన: ఈ నెలాఖరుతో పదవీ విరమణ పొందనున్న జీఎం(ఈఅండ్ఎం),(ఓసీపీలు) గోపాల క్రిష్ణ మూర్తిని శుక్రవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి అధికారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన గోపాల క్రిష్ణ మూర్తిని గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో పాటు విభాగాల ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించి మొక్కను జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం మాట్లాడుతూ గోపాలక్రిష్ణమూర్తి సింగరేణి సంస్థకు అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్ రావు, డీజీఎం సతీష్‌బాబు, రామారావు, ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం



అసంపూర్తి పనులతో బురదమయంగా మారిన రోడ్డు



బురదలో ఇరుక్కుపోయిన లారీ

రెబ్బెన: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. మండల కేంద్రంలో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గంగాపూర్ కమాన్ నుంచి జర్నలిస్టు కాలనీ వరకు అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల కారణంగా రోడ్డంతా బురదమయంగా మారింది. రోడ్డు గుండా వచ్చే వాహనాలు బురదలో ఇరుక్కు పోవడంతో రోడ్డుపైనే వదిలేసి వెళ్లిపోవాల్సిన దుస్థితి నెలకొంది. శుక్రవారం సాయంత్రం అధికారులు ఎంపీడీవో కార్యాలయం నుంచి సీఐ కార్యాలయం వరకు తూతూ మంత్రంగా రాతిపొడి పోసి మిగిలిన రోడ్డును అలాగే వదిలేశారు.

సంతలో గుడ్డ సంచుల పంపిణీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గని ఉద్యోగులు, అధికారులు ఆర్కే 6 కొత్త రోడ్‌లో వారాంత సంతలో శుక్రవారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. స్వచ్ఛత పక్వాడ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి పాల్గొని గుడ్డ సంచులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ కూరగాయలు, సరుకుల కోసం ఇంటి నుంచే గుడ్డ సంచులు తీసుకురావాలన్నారు. సేఫ్టీ అధికారి శ్రీనివాస్, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

భీమారం: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని రిటైర్డ్ ఏసీపీ రవికుమార్ అన్నారు. ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం పురస్కరించుకుని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. హ్యాండ్ బాల్‌పోటీల్లో భీమారం విద్యార్థులు ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. త్వరలో జరిగే ప్రీమియమ్ లీగ్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కౌటాల: మండల కేంద్రానికి చెందిన కామ్రె ఆత్మారాం అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధితుడు శుక్రవారం తెలిపారు. ఆవును మేతకు వదలడంతో స్థానిక పెట్రోల్ పంపు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆవు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పశువైద్య సహాయ అధికారి సందీప్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.